# కూటమి ధర్మానికి తూట్లు

- పొత్తు లోక్‌సభ ఎన్నికలకేనా.. రాష్ట్ర స్థాయిలో లేదా?
- ఇలా అని తెలిస్తే 'ఇండియా'లో చేరేవారము కాదు
- కాంగ్రెస్‌పై సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ మండిపాటు
- కూటమిలో కొనసాగడంపై పునరాలోచిస్తామని వ్యాఖ్య



న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను ఓడించేందుకు ఏర్పడిన ఇండియా కూటమి అప్పుడే బీటలు వారుతున్నట్టు తెలుస్తున్నది. ఈ కూటమి ఐక్యతను కాంగ్రెస్ పార్టీ దెబ్బ తీస్తున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ధర్మాన్ని కాంగ్రెస్ భగ్నం చేస్తున్నదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు రాష్ర్టాలకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని మిత్రులపైనే కాంగ్రెస్ పోటీకి దిగుతున్నది. కూటమి ధర్మానికి నీళ్లొదులుతూ కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరుపై ఆయా పార్టీల నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిలోని ఇతర పార్టీలను మోసం చేస్తున్నదని అఖిలేశ్ యాదవ్ విరుచుకుపడ్డారు. రాష్ట్రస్థాయిలో పొత్తులు ఉండవని తెలిస్తే ఇండియా కూటమిలో చేరటంపై అప్పుడే ఆలోచించేవారమని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో చేతులు కలపడంపై పునరాలోచన చేస్తామని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ సర్కార్‌ను గద్దె దించేందుకు ఎన్నికల బరిలోకి దిగిన ఇండియా కూటమిలోని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు 18 స్థానాల్లో పరస్పరం పోటీ పడుతున్నాయి. ఇది బీజేపీ వ్యతిరేక ఓట్లను చీలుస్తుందని, తిరిగి కమలం పార్టీకే లాభం చేకూరుస్తుందని అఖిలేశ్ వాపోతున్నారు. దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోటీ విషయమై ముందుగానే తాము కాంగ్రెస్ మధ్యప్రదేశ్ నేత కమల్‌నాథ్‌తో చర్చించామని, గతంలో తాము గెలిచిన స్థానాలు, రెండో స్థానంలో నిలిచిన నియోజకవర్గాల జాబితాను ఇచ్చామని తెలిపారు. కానీ తాము గెలిచిన సీట్లలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిందని వాపోయారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉత్తరప్రదేశ్ నేత అజయ్‌రాయ్ చేసిన వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య వివాదం మొదలైంది. మధ్యప్రదేశ్‌లో ఎస్పీకి బలమే లేదని, అక్కడ ఆ పార్టీ పోటీ చేయకూడదని అన్నారు. ఇక ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం 80 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించటం సమాజ్‌వాదీ నేతలకు ఆగ్రహం తెప్పించింది. 'ఈ చోటా మోటా కాంగ్రెస్ నేతలంతా బీజేపీతో సంబంధాలు కలిగి ఉన్నారు. ముందుగా తెలిసి ఉంటే మా నాయకులను కాంగ్రెస్ వద్దకు పంపేవారము కాదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

## బతికున్నంత కాలం బీజేపీ నేతలతో స్నేహం

### బీహార్ సీఎం, ఇండియా కూటమి నేత నితీశ్ వ్యాఖ్యలు



పాట్నా: బీహార్ సీఎం, ఇండియా కూటమి నేత నితీశ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో తిరిగి చేరేది లేదని చెప్పుకొస్తున్న ఆయన బీజేపీ నేతలు తన స్నేహితులని, తాను బతికున్నంత కాలం వారితో స్నేహం ఉంటుందని తాజాగా పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. గురువారం మోతిహారిలో నితీశ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'కలిసి పనిచేద్దాం. మిగతా పనులను పూర్తి చేయడంలో మీ సహకారాన్ని ఆశిస్తున్నా' అని అన్నారు. 'ఎవరు ఎక్కడున్నా, వీళ్లంతా నా స్నేహితులు. మా స్నేహం నేను బతికున్నంత కాలం కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నాను. చింతించకండి!' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, బీజేపీ ఎంపీ రాధామోహన్ సింగ్, పలువురు బీజేపీ నేతలు హాజరయ్యారు.

# కలహాల కాంగ్రెస్

- రాజస్థాన్‌లో గెహ్లాట్, పైలట్ మధ్య విభేదాలు
- మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ వర్సెస్ దిగ్విజయ్
- అసెంబ్లీ ఎన్నికల వేళ ఆందోళనలో అధిష్ఠానం
- రాజస్థాన్‌లో ప్రారంభం కాని టికెట్ల పంపిణీ
- భేటీకి పైలట్‌ను ఆహ్వానించని హైకమాండ్
- మధ్యప్రదేశ్‌లోనూ కొనసాగుతున్న టికెట్ల రగడ



మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేతలు దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్. రాజస్థాన్ కాంగ్రెస్ నేతలు సచిన్ పైలట్, అశోక్ గెహ్లాట్

న్యూఢిల్లీ: వచ్చే నెల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ర్టాల్లో కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు, కుమ్ములాటలు ఆ పార్టీని కలవరపెడుతున్నాయి. నేతల అంతర్గత పోరు ఏ పరిణామాలకు దారితీస్తుందోనని అధిష్ఠానం ఆందోళన చెందుతున్నదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ర్టాల్లో కాంగ్రెస్‌లో నెలకొన్న వర్గపోరును పరిష్కరించడంలో అధిష్ఠానం విఫలమైంది. రాజస్థాన్‌లో సీఎం అశోక్ గెహ్లాట్, యువనేత సచిన్ పైలట్ మధ్య విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో అంతర్గతంగా ఎవరి వ్యూహాలు వారికి ఉన్నాయని, టికెట్ల కేటాయింపు సమయంలో రెండు వర్గాల మధ్య విబేధాలు బయటపడే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లో పార్టీ సీనియర్ నేతలైన మాజీ సీఎంలు దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్ ఎపిసోడ్ కాక రేపుతున్నది. టికెట్ల కేటాయింపు విషయంలో ఇద్దరి మధ్య పొరపొచ్చాలు ఉన్నట్టు తెలుస్తున్నది. తాజాగా తన వర్గం నేత వీరేంద్ర రఘువంశికి శివపురి నుంచి టికెట్టు ఇవ్వకపోవడం పట్ల కమల్‌నాథ్ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. 'వెళ్లి దిగ్విజయ్ బట్టలు చింపండి' అంటూ.. కార్యకర్తలను ఆయన ఉసిగొల్పడం చర్చనీయాంశమైంది. దీనిపై స్పందించిన డిగ్గీరాజా 'పెద్దలకు వివేకం ఉండాలి' అంటూ చురక లంటించారు.

**రాజస్థాన్‌లో మొదటి నుంచి కలహాల కాపురమే..**

రాజస్థాన్‌లో 2018లో అధికార పీఠమెక్కిన నాటి నుంచి అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ వర్గాలు కొట్లాడుకొంటున్నాయి. గెహ్లాట్‌పై సచిన్ పైలట్ దాదాపు 20 మంది ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేశారు. దీంతో ఆయన్ను డిప్యూటీ సీఎంగా, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి అధిష్ఠానం తొలగించింది. అవినీతిపై పోరాటం పేరుతో సొంత పార్టీ సీఎం పైనే పైలట్ రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపట్టారు. కాగా, తాజాగా అశోక్ గెహ్లాట్ సీఎం పదవిపై తనకున్న వ్యామోహాన్ని బయటపెట్టారు. ఢిల్లీలో మాట్లాడుతూ 'నన్ను నాలుగోసారి సీఎంగా చూడాలని అనుకుంటున్నట్టు ఇటీవల ఓ మహిళా కార్యకర్త నాతో చెప్పింది. నేను సీఎం పదవిని వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నాను.. కానీ సీఎం పదవి నన్ను వదలడం లేదని ఆమెతో చెప్పాను' అని మరోసారి తానే సీఎం అభ్యర్థినని అశోక్ గెహ్లాట్ చెప్పకనే చెప్పారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి.




**టికెట్లపై ఎవరి మాట నెగ్గుతుందో?**

టికెట్ల పంపిణీలో గెహ్లాట్, పైలట్ మధ్య విభేదాలు తలెత్తున్నట్టు తెలుస్తున్నది. తమ అనుయాయులకు టికెట్టు ఇప్పించుకొంటారా? ఎవరి మాట నెగ్గుతుందనేది ఆసక్తికరంగా మారింది. రాజస్థాన్‌లో అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు బుధవారం నిర్వహించిన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశానికి సచిన్ పైలట్‌ను ఆహ్వానించకపోవడం చర్చనీయాంశమైంది. కాగా, సచిన్ పైలట్ సీడబ్ల్యూసీ సభ్యుడిగా అధిష్ఠానం ఎంపిక చేయడంపై ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో గెహ్లాట్ స్పందిస్తూ.. ఇప్పుడు ఆయనే హైకమాండ్ అయ్యారని, టికెట్ల కేటాయింపులో ఆయన పాత్ర ఉండొచ్చని వ్యాఖ్యానించారు.

**మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వంపై వ్యతిరేకతను సొమ్ము చేసుకొనేనా?**

ఇక మధ్యప్రదేశ్ విషయానికొస్తే అక్కడ శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకొని అధికారంలోకి వద్దామనుకొంటున్న కాంగ్రెస్‌కు.. కమల్‌నాథ్, దిగ్విజయ్ మధ్య విభేదాలు తలనొప్పిగా మారాయి. అభ్యర్థుల ఎంపికలో అపార్థాలు, తప్పులు జరుగుతున్నాయంటూ మంగళవారం టికెట్ ఆశావహుడు వీరేంద్ర మద్దతుదారుల ఆందోళన సందర్భంగా దిగ్విజయ్‌ను ఉద్దేశించి కమల్‌నాథ్ వ్యాఖ్యలు చేశారు. వీరేంద్రకు టికెట్ దక్కాలని తాను కోరుకొంటున్నానని, అయితే అది జరుగలేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో మరో నెలలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని నేతల మధ్య ఐక్యతపై ప్రశ్నలు వస్తున్నాయి.

# నా సీటుపై 40 కోట్ల డీల్!

### బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు కాంగ్రెస్ నేతల ఒప్పందం

### రాజస్థాన్ మహిళా నేత ఆరోపణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న అన్ని రాష్ర్టాల్లో కాంగ్రెస్ పార్టీలో టికెట్ల లొల్లి కొనసాగుతున్నది. తెలంగాణలో పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే టిక్కెట్లను కోట్ల రూపాయలకు అమ్ముకొన్నాడని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తుండగా.. రాజస్థాన్‌లో బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు పలువురు కాంగ్రెస్ నేతలు రూ.40 కోట్ల మేర డీల్ చేసుకొన్నారని ఆ పార్టీకే చెందిన మహిళా నేత ఒకరు ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. మాలవీయనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్టును మహిళా నేత, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ అర్చానా శర్మ ఆశిస్తున్నారు. ఆమె తాజాగా మాట్లాడుతూ తనకు టికెట్టు దక్కకుండా చేయడం ద్వారా బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు కొంత మంది సొంత పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా ఓడిపోతాడని సర్వేలో తేలినా.. రాజీవ్ అరోడాకు టికెట్టు ఇప్పించడం ద్వారా పరోక్షంగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలనేది వారి ప్లాన్‌లో భాగమని ఆరోపించారు. ఈ మేరకు ఓ హోటల్‌లో రూ.40 కోట్ల ఒప్పందం కుదిరిందన్నారు. ఈ డీల్ ఎవరెవరి మధ్య జరిగిందో తన వద్ద సమాచారం ఉందన్నారు. అయితే అర్చానా శర్మ తన ప్రసంగంలో ఎవరి పేర్లు ప్రస్తావించలేదు.

# ఇందిర క్యాంటీన్లకు తాళం!

**కర్ణాటకలో కాంగ్రెస్ మరో హామీ గంగపాలు**

- నిధులలేమితో ఇందిర క్యాంటీన్ల మూసివేత
- ఇప్పటికే 23 క్యాంటీన్లు, 11 కిచెన్లకు తాళం
- మరమ్మతుల పేరిట మరో 50 క్యాంటీన్లకు చెక్
- తెలంగాణలో అప్రతిహతంగా 'అన్నపూర్ణ' స్కీమ్
- 11 కోట్లమంది ఆకలి తీర్చిన అతిపెద్ద స్కీమ్‌గా గుర్తింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీకి కర్ణాటక కాంగ్రెస్ తూట్లు పొడిచింది. పేదలు, వివిధ పనుల కోసం బెంగళూరు నగరానికి వచ్చే సామాన్యులకు, కార్మికుల కడుపునింపేందుకు తీసుకొచ్చిన ఇందిర క్యాంటీన్లను క్రమంగా మూసేస్తున్నది. బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) ఆధ్వర్యంలో బెంగళూరు నగరవ్యాప్తంగా 175 శాశ్వత ఇందిర క్యాంటీన్లు, మరో 24 మొబైల్ క్యాంటీన్లు, 19 కిచెన్లు నడిచేవి. ఇందులో 23 క్యాంటీన్లకు (6 శాశ్వత క్యాంటీన్లు, 17 మొబైల్ క్యాంటీన్లు), మరో 11 కిచెన్లకు తాజాగా తాళం వేశారు. ఆహారాన్ని సరఫరా చేసే సప్లయర్లకు, క్యాంటీన్ల నిర్వాహకులకు చెల్లింపుల్లో జాప్యం జరుగడమే క్యాంటీన్ల మూసివేతకు ప్రధాన కారణమని తెలుస్తున్నది. నిధుల కొరతతో చెల్లింపుల్లో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని బీబీఎంపీ అధికారులు అంగీకరించారు.

**అన్నింటా సమస్యలే**

2017లో ఈ పథకం కింద అల్పాహారం (రూ.5), మధ్యాహ్నం, సాయంత్రం భోజనాన్ని (రూ.10 చొప్పున) వడ్డించేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ 'ఇందిర క్యాంటీన్ల'ను మరింతగా విస్తరిస్తామని హామీ ఇచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఈ స్కీమ్‌ను క్రమంగా అటకెక్కిస్తున్నారు. క్యాంటీన్లను నిర్వహించే వారికి చెల్లింపులు చేయకపోవడమే కాదు.. నీరు, కరెంటును కూడా ప్రభుత్వం సక్రమంగా సరఫరా చేయట్లేదు. మొబైల్ క్యాంటీన్ల కోసం సిద్ధంచేసిన వాహనాలు పాడైనప్పటికీ మరమ్మతులు నిర్వహించకపోవడంతో అవి మూలకుపడ్డాయి.




నిర్వహణలోపంతో మూసివేతకు సిద్ధంగా ఉన్న బెంగళూరులోని ఓ ఇందిర క్యాంటీన్

**భస్మాసుర హస్తం**

**బెంగళూరులో అలా...**
స్కీమ్‌పేరు: ఇందిర క్యాంటీన్లు
ప్రారంభం: 2017
మొత్తం క్యాంటీన్లు: 199
మూతబడ్డవి: 23 కేంద్రాలు

**తెలంగాణలో ఇలా..**
స్కీమ్‌పేరు: అన్నపూర్ణ
ప్రారంభం: 2014
మొత్తం కేంద్రాలు: 373
మూతబడ్డవి: 0

**రాజస్థాన్‌లో ఇందిర క్యాంటీన్లలో అక్రమాలు..**

అర్ధాకలితో పడుకుంటున్న పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు ప్రారంభించిన ఇందిర క్యాంటీన్లు రాజస్థాన్‌లో అవినీతికి నిలయాలుగా మారాయి. నాగోర్ పట్టణంలో ఒక మీడియా సంస్థ చేపట్టిన స్టింగ్ ఆపరేషన్‌లో అక్రమాలు బయటపడ్డాయి. క్యాంటీన్ల సిబ్బందే బట్టలు మార్చుకుంటూ భోజనం ప్లేటు తీసుకుంటున్నట్లు స్టింగ్ ఆపరేషన్‌లో తేలింది. ఓ మహిళ మూడు సార్లు బట్టలు మార్చుకుని భోజనం టోకెన్ తీసుకుంది. ఓ క్యాంటీన్‌లో 30 మంది మాత్రమే తిన్నట్లు తేలగా రికార్డుల్లో 200 మంది భోజనం తిన్నట్లు ఉంది. ఈ లెక్కన చూస్తే ఆ ఒక్క పూట ఆ ఒక్క క్యాంటీన్లోనే రూ. 2,890ను దొంగ లెక్కలతో దోచుకున్నట్టు తేలింది.

**ఏటా తెలంగాణ-అన్నపూర్ణ భోజనాల పంపిణీ వివరాలు ఇలా..**

| సంవత్సరం | భోజనాల సంఖ్య |
|---|---|
| 2014-15 | 9,12,685 |
| 2015-16 | 27,12,046 |
| 2016-17 | 38,49,620 |
| 2017-18 | 95,59,676 |
| 2018-19 | 1,03,06,590 |
| 2019-20 | 89,63,665 |
| 2020-21 | 2,29,46,080 |
| 2021-22 | 3,36,87,830 |
| 2022-23 | 72,31,210 |
| 2023 (ఏప్రిల్ వరకూ) | 28,60,540 |
| మొత్తం | 10,52,59,162 |

**అన్నార్తులకు అక్షయపాత్ర**

ఆకలితో ఏ ఒక్కరూ అలమటించకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ సంకల్పంతో 2014 నుంచి అమలవుతున్న 'అన్నపూర్ణ పథకం (రూ. 5కే భోజనం)' ద్వారా గత ఏప్రిల్‌నాటికి 10.52 కోట్ల మందికి నాణ్యమైన భోజనం లభించింది. ఈ స్కీమ్‌లో భాగంగా రూ. 5కే 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల సాంబారు, 100 గ్రాముల పప్పు, ఒక కూరతో పాటు 15 గ్రాముల పచ్చడి, ఓ నీటి ప్యాకెట్‌ను అందిస్తున్నారు. ఒక్కో భోజనం తయారీకి రూ. 27.5 ఖర్చు అవుతుండగా, జీహెచ్ఎంసీ రూ. 22.5 భరిస్తున్నది. ఈ పథకం దవాఖానలు, ద్వితీయశ్రేణి పట్టణాలతో కలిపి 373 కేంద్రాలకు చేరింది.



సీఎం ఏక్‌నాథ్ షిండే | బీజేపీ నేత ఫడ్నవీస్ | అజిత్ పవార్

# మహాయుతి కూటమిలో ముసలం

- లోక్‌సభ ఎన్నికల సీట్ల పంపకంపై లొల్లి
- 22 సీట్లు డిమాండ్ చేస్తున్న షిండే వర్గం
- 11 స్థానాలపై కన్నేసిన అజిత్ పవార్
- తమకు 15 సీట్లేనా అంటూ బీజేపీ ఆగ్రహం

ముంబై: మహారాష్ట్రలోని మహాయుతి (బీజేపీ, శివసేన-షిండే వర్గం, ఎన్సీపీ-అజిత్‌పవార్ వర్గం) కూటమి ప్రభుత్వంలో కుమ్ములాటలు మొదలయ్యాయి. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకంపై కూటమి పార్టీల మధ్య లొల్లి బయటపడింది. క్షేత్రస్థాయిలో తమకే ఎక్కువ బలం ఉందంటూ ఎక్కువ స్థానాలను కేటాయించాలని కూటమిలోని శివసేన (షిండే వర్గం), అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ పట్టుబడుతుండటంతో బీజేపీకి తలనొప్పిగా మారింది. ఏక్‌నాథ్ షిండే వర్గం ఏకంగా 22 స్థానాలు కావాలని పట్టుబడుతున్నది. మరోవైపు అజిత్ వర్గం 11 సీట్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నది. దీంతో రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా ఉన్న తాము 15 స్థానాల్లోనే పోటీ చేయాలా? అంటూ బీజేపీ ఇరు పక్షాలపై గుర్రుగా ఉన్నట్టు తెలుస్తున్నది. మిత్రపక్షాలను ఎలా సముదాయించాలో తెలియక బీజేపీ తలలు పట్టుకుంటున్నది.

**మా డిమాండ్‌ను బీజేపీ ముందుంచాం...**

బీజేపీ, శివసేన (షిండే వర్గం) మధ్య తాజాగా సీట్ల పంపకాలపై జరిగిన చర్చలో తమకు 22 ఎంపీ స్థానాలను కేటాయించాల్సిందేనని షిండే వర్గం పట్టుబడినట్టు సమాచారం. 'గత లోక్‌సభ ఎన్నికల్లో శివసేన 18 స్థానాల్లో గెలుపొందింది. నలుగురు అభ్యర్థులు స్వల్ప తేడాతో ఓడిపోయారు. అందుకే తమ బలానికి తగ్గట్టుగా 22 స్థానాలను మాకు ఇవ్వాలి' అని షిండే వర్గానికి చెందిన ఓ సీనియర్ నేత తెలిపారు.

**మాకు మిగిలేదేంటి?**

అయితే షిండే వర్గం డిమాండ్‌ను బీజేపీ నేతలు తప్పుబట్టారు. 'షిండే వర్గానికి 22 సీట్లు, అజిత్‌పవార్‌కు 11 సీట్లు కేటాయిస్తే మాకు మిగిలేదేంటి? 48 సీట్లలో 15 సీట్లా? అది ఎలా సాధ్యపడుతుంది' అని బీజేపీ సీనియర్ నేత పేర్కొన్నారు. కాగా, బీజేపీ నేత, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పందిస్తూ ఇప్పటివరకు చర్చలు జరగలేదని పేర్కొనడం గమనార్హం.



## డీకేకు చుక్కెదురు

### అక్రమాస్తుల కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

బెంగళూరు: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌కు హైకోర్టులో గురువారం చుక్కెదురైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. దర్యాప్తు చాలా వరకు పూర్తయినందువల్ల ఈ దశలో జోక్యం చేసుకోబోమని తెలిపింది. దర్యాప్తును పూర్తి చేసి, మూడు నెలల్లోగా నివేదికను సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. 2013-18 మధ్య కాలంలో కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వంలో డీకే శివకుమార్ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఆయన వెల్లడించిన ఆదాయ మార్గాల ద్వారా వచ్చిన ఆదాయం కన్నా ఎక్కువ ఆస్తులను పోగేశారని సీబీఐ ఆరోపించింది. 2020 సెప్టెంబరు 3న ఎఫ్ఐఆర్ దాఖలైంది.

## జేడీఎస్ కర్ణాటక అధ్యక్షుడి తొలగింపు

### బీజేపీతో పొత్తును వ్యతిరేకించిన ఇబ్రహీం

బెంగళూరు, అక్టోబర్ 19: బీజేపీతో పొత్తు జనతాదళ్ సెక్యులర్(జేడీఎస్) పార్టీలో చిచ్చుపెట్టింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కర్ణాటక జేడీఎస్ అధ్యక్షుడు సీఎం ఇబ్రహీంను పార్టీ అధినేత హెచ్‌డీ దేవెగౌడ ఆ పదవి నుంచి తొలగించారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీని గురువారం రద్దు చేయడంతో.. ఇబ్రహీంను కూడా అధ్యక్ష పోస్టు నుంచి తొలగించినట్టు అయింది. ఇదే సమయంలో రాష్ట్ర జేడీఎస్ తాత్కాలిక అధ్యక్షుడిగా తన కుమారుడు, మాజీ సీఎం కుమారస్వామిని దేవెగౌడ నియమించారు.

## రెడ్ మీట్‌తో డయాబెటిస్ ముప్పు

### హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధకుల వెల్లడి

మసాచుసెట్స్, అక్టోబర్ 19: రెడ్‌మీట్(మటన్, బీఫ్)ను అతిగా తింటే టైప్-2 డయాబెటిస్ బారినపడతారని తాజాగా ఓ అధ్యయనంలో తేలింది. వారంలో రెండు సార్లు, అంతకంటే ఎక్కువగా రెడ్‌మీట్‌ను తినేవారు టైప్-2 డయాబెటిస్ బారినపడే అవకాశం అధికంగా ఉందని కేంబ్రిడ్జ్‌లోని హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు. 2,16,695 మంది ఆరోగ్య డాటాను విశ్లేషించిన పరిశోధకులు కొత్త విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు.

**22 వేల మందికి పైగా...**

36 ఏండ్ల డాటాను విశ్లేషించిన పరిశోధకులు 22 వేల మందికి పైగా టైప్-2 డయాబెటిస్ బారినపడినట్టు గుర్తించారు. అతిగా రెడ్‌మీట్ తినేవారు టైప్-2 డయాబెటిస్ బారినపడే ప్రమాదం 62 శాతం పొంచి ఉందని పరిశోధకులు తెలిపారు.

## మాటలతో మధుమేహం నిర్ధారణ!

న్యూయార్క్, అక్టోబర్ 19: మీకు మధుమేహం ఉందో, లేదో తెలుసుకోవాలనుకొంటే.. మీ మాటలు రికార్డ్ చేసి టెస్ట్ చేస్తే చాలు! కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన వాయిస్ టెక్నాలజీకి సంబంధించిన తాజా అధ్యయనం ఇది సాధ్యమేనని అంటున్నది. వ్యక్తులు 6-10 సెకన్ల పాటు మాట్లాడిన మాటలు, వారి ప్రాథమిక ఆరోగ్య వివరాల సాయంతో వారికి టైప్ 2 డయబెటిస్ ఉందా లేదా అనే విషయాన్ని కనుగొనవచ్చని అమెరికాలోని క్లిక్ ల్యాబ్స్ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మయో క్లినిక్ ప్రొసీడింగ్స్: డిజిటల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం ఈ వాయిస్ టెక్నాలజీ ద్వారా మహిళల్లో 89 శాతం, పురుషుల్లో 86 శాతం కచ్చితత్వంతో డయబెటిస్ ఉందో లేదో నిర్ధారించవచ్చు.


# సంతాన నియంత్రణ ఇంజెక్షన్!

- పురుషుల కోసం అభివృద్ధి
- ప్రపంచంలోనే మొట్టమొదటిది
- వ్యాసెక్టమీకి ప్రత్యామ్నాయం
- అభివృద్ధి చేసిన ఐసీఎంఆర్
- క్లినికల్ ట్రయల్స్ సక్సెస్
- సమర్థంగా పనిచేస్తున్నట్టు వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: పిల్లలు పుట్టకుండా పురుషులకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సంతాన నియంత్రణ విధానం వ్యాసెక్టమీకి ప్రత్యామ్నాయంగా మరో విధానం అందుబాటులోకి రానున్నది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) 'ఇంజెక్టబుల్ మేల్ కాంట్రాసెప్టివ్'ను తీసుకువస్తున్నది. ఈ ఇంజెక్షన్‌పై క్లినికల్ ట్రయల్స్ విజయవంతమయ్యాయి. ఢిల్లీ, ఉదంపూర్, లూధియానా, జైపూర్, ఖరగ్‌పూర్‌లోని దవాఖానల్లో ఈ ట్రయల్స్ నిర్వహించారు. 25-40 ఏండ్ల మధ్య వయసున్న 303 మందిపై నిర్వహించిన ఫేజ్3 ట్రయల్స్ ఫలితాలను ఇంటర్నేషనల్ ఓపెన్ యాక్సెస్ ఆండ్రాలజీ జర్నల్‌లో ప్రచురించారు. ఇంజెక్షన్ సమర్థంగా పనిచేస్తున్నదని, దుష్ప్రభావాలు కూడా పెద్దగా లేవని ట్రయల్స్‌లో తేలింది.

**డీసీజీ అనుమతితో క్లినికల్ ట్రయల్స్...**

పిల్లలు పుట్టకుండా పురుషుల్లో నిరోధించేందుకు వ్యాసెక్టమీ పద్ధతిని ఇప్పటివరకు వినియోగిస్తున్నారు. అయితే అందులోనూ కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. దీంతో కొత్త రకం చికిత్స అవసరం అయింది. ఐఐటీ-ఖరగ్‌పూర్‌కు చెందిన పరిశోధకుడు డాక్టర్ సుజోయ్ కె గుహ నేతృత్వంలో ప్రపంచంలో మొదటిసారిగా పురుషుల్లో శుక్రకణాల విడుదలను నిలువరించేందుకు రివర్సబుల్ ఇన్‌హిబిషన్ ఆఫ్ స్పెర్మ్ అండర్ గైడెన్స్ (ఆర్ఐఎస్‌యూజీ) ఇంజెక్షన్‌ను అభివృద్ధి చేశారు. డ్రగ్స్ కంట్రోలర్ ఆఫ్ జనరల్ ఇండియా (డీసీజీ) అనుమతితో ఫేజ్-3 ట్రయల్స్ నిర్వహించారు.



**99.02 శాతం సమర్థత...**

తాజాగా నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో సానుకూల ఫలితాలు వచ్చినట్టు ఐసీఎంఆర్ తెలిపింది. ఆర్ఐఎస్‌యూజీ ఇంజెక్షన్ సక్సెస్‌ఫుల్‌గా పురుషుల్లో సంతాన నిరోధకంగా పని చేసినట్టు పేర్కొంది. అజూస్పెర్మియా (ఉద్వేగ సమయంలో స్రవించే ద్రవాల్లో శుక్రకణాలు లేకపోవడం)కు సంబంధించి ఆర్ఐఎస్‌యూజీ ఇంజెక్షన్ 97.3 శాతం సమర్థవంతంగా పని చేసినట్టు తెలిపింది. అదే సమయంలో 99.02 శాతం గర్భ రాకుండా నిరోధించినట్టు పరిశోధకులు గుర్తించారు. తీవ్రమైన దుష్ప్రభావాలు కూడా లేవని వారు తెలిపారు.